
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





## - 194-
## ఎన్నికలూ- రాజకీయాలూ

**ఈ ఏడాది జనవరి,** 2024 నెలాఖరులో చుట్టం చూపుగా భారత దేశం వెళ్ళినప్పటి నుంచీ నా సొంతపనుల మాట ఎలా ఉన్నా అటు ఆంధ్రా, తెలంగాణా ఇటు మోడీ, బైడెన్, ట్రంప్ రాజకీయాలని గమనిస్తూనే ఉన్నాను. ఎందుకంటే రెండు దేశాలలోనూ అవి ఎంత ఆసక్తికరంగా ఉన్నాయో, అంత హాస్యం, అపహాస్యం, చికాకు, ప్రజాస్వామ్యం నిజంగానే అమలులో ఉందా, అంతా డ్రామా యేనా అనే పరస్పర విరుద్ధమైన వాతావరణం భారత దేశం పర్యటనలో ప్రత్యక్షం గానే గమనించాను.

సుమారు ఆరు నెలల క్రితం తెలంగాణా ఎన్నికలతో ఈ తికమక ప్రారంభం అయింది. తెలంగాణా రాష్ట్రాన్ని సాధించి పెట్టిన వీరుడిగా కెసిఆర్ కి రెండు సార్లు ..అంటే 8 ఏళ్ళు అధికారాన్ని అప్పగించిన ప్రజలు ఈ సారి ఆయన్ని 'ఇక చాలు, బిడ్డా" అని భారీగానే ఓడించి, తెలంగాణా ఇచ్చిన అమ్మ సోనియా గారి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి తన సామూహిక విజ్ఞతని చాటి చెప్పుకుంది. కేసీఆర్ ఎందుకు అంతగా ఓడిపోయాడూ అనడానికి చాలా కారణాలే ఉన్నాయి. తొలి విడత పరిపాలన బాగానే ఉన్నా....మలి విడత నాటికి జనాల అవగాహనలో మార్పు వచ్చింది. కుటుంబ పాలనలా సాగడం, ప్రగతి భవన్ కంచుకోటలా మారి కేసీఆర్ ప్రజలకి అందుబాటులోకి రాకపోవడం, కాళేశ్వరం అవక తవకలు, ప్రాంతీయ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగే అత్యాశతో ఏకంగా పార్టీ పేరునే మార్చేసి ..అందులో తెలంగాణా అనే పదం తీసేసి భారత్ రాష్ట్ర సమితి అనే అనాలోచిత నిర్ణయం మొదలైనవి కేసీఆర్ ని జనాలకి దూరం చేసింది. ఇవేమీ గమనించకుండా "మేము కాకపోతే ఇంకెవరున్నారు మీకు" అనే భ్రమలో పడిపోయి తన ఇంట్లో శుభకార్యం జరుగుతుండగా రేవంత్ రెడ్డిని అరెస్ట్ చెయ్యడం టీ ఆర్ ఎస్ కి ఒక కీలకమైన వ్యతిరేక పరిణామం. ఇలా అనేక కారణాలకి టీ ఆర్ ఎస్ ని గద్దె దించి తెలంగాణా ప్రజలు అనూహ్యంగా కాంగ్రెస్ కి విజయం కట్టబెట్టారు. సందట్లో సడేమియా అన్నట్టు ఈ తతంగం లో బీజేపీ కూడా ప్రజలలోనే ఉంటూ టీ ఆర్ ఎస్ బలహీనతని తన వేపు కాస్త మళ్ళించుకుని బలం పుంజుకుంది.

ఇక ఆంధ్ర ప్రదేశ్ విషయాని కొస్తే....నేను జనవరి, 2024 నుంచి మార్చ్ నెలాఖరు దాకా వేరే పనుల మీద కాకినాడ, రాజమండ్రి, వైజాగ్, యలమంచిలి, నరసాపురం, విజయవాడ మొదలైన నగరాలకి వెళ్ళినప్పుడు అందరితోటీ యాదాలాపంగా రాజకీయాల గురించి మాట్లాడడం జరిగింది. ఎంతయినా ఎన్నికల సీజన్ కదా!. ఎక్కడ చూసినా సిద్ధం, సంసిద్ధం, నువ్వే మా నామ్మకం, సైకో పోవాలి మొదలైన రకరకాల స్లోగన్స్ తో నాయకుల ప్లెక్సీలతో రాష్ట్రం అంతా కలకలంగానే ఉంది. సామాన్యుల నుంచి నేను విన్న అభిప్రాయాలలో జగన్ పరిపాలనా విధానాల మీద వ్యతిరేకత బాగా వినపడింది. ముఖ్యమంత్రి అయ్యాక ప్రజల మాట దేవుడెరుగు, తన సొంత మంత్రులకి కూడా అందుబాటులో ఉండకుండా సాయంత్రం ఐదింటికల్లా ఇంటికెళ్ళిపోయి వీడియో గేమ్స్ ఆడుకుంటాడు అనీ, పల్లెటూళ్ళలో అందరికీ ఏదో ఒక పేరున డబ్బు వాళ్ళ ఖాతాలో వేసేసి సంక్షేమం పేరిట వోట్లు కొనుక్కుంటున్నాడు అనీ, రోడ్లు, నీళ్ళు మొదలైన కనీస అవసరాలని గాలికి వదిలేసి, అసలు రాష్ట్రం అభివృద్ధి గురించి ఏ మాత్రం పట్టించుకో లేదు అనీ, అమరావతిలో రియల్ ఎస్టేట్ పెట్టుబడులతో ఒకానొక అగ్రకులం ఏకపక్షంగా అన్ని లాభాలూ తమ వేపే అనుకున్న పరిస్థితినుంచి వారిని అణగదొక్కడానికి మూడు రాజధానుల ప్రతిపాదన చేసి అసలు రాజధానే లేకుండా నాలుగేళ్ళు గడిపేశాడు అనీ, పిన తండ్రి హత్య కేసు విచారణలో జాప్యం, కోడికత్తి లాగా గులక రాయి తతంగం...ఇలాంటి వన్నీ కలిసి జగన్ మీద వ్యతిరేకత ఎంత వినపడినా....గ్రామాలలో బలంగా ఉన్నాడు కాబట్టి ఈ సారి కూడా జగన్ నెగ్గుతాడు కానీ ఎక్కువ మెజారిటీ రాదు అనే చాలా మంది అనుకున్నారు.

కానీ....ఎప్పుడైతే చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేశారో....మొత్తం రాజకీయ పరిస్థితి మారిపోయింది. దానితో పాటు ప్రజల ఆలోచనా ధోరణి ఆ కల్లోలంలో అత్యంత నిశ్శబ్దంగా మారిపోయింది. రాజకీయాల మాట ఎలా ఉన్నా చంద్రబాబు నాయుడు మీద రాష్ట్ర ప్రజలకి వ్యక్తిగతంగా గౌరవం ఉంది. రాష్ట్ర అభివృద్ధి మీద ఆయనకి ఉన్న నిజమైన ఆసక్తి, చిత్తశుద్ధి, తన అనుయాయులు ఎంత లాభపడినా వ్యక్తిగతంగా నిజాయితీ గల వ్యక్తి అనే నమ్మకం, పరిపాలనా దక్షత మొదలైన అంశాల వలన చంద్రబాబు అరెస్ట్ జగన్ కి బెడిసికొట్టింది. అన్నింటికన్నా ముఖ్యంగా పవన్ కల్యాణ్ ని అప్పటికప్పుడు చంద్రబాబుతో కూటమికి అత్యంత బలమైన అవకాశాన్ని ఇచ్చింది. పవన్ కల్యాణ్ ఈ అవకాశాన్ని అద్భుతంగా మల్చుకుని, ఆఖరికి అంటీ పట్టని విధంగా ఉన్న బీజేపీ ని కూడా కలిసేలా కూటమి ని తీర్చిదిద్దడం లో ఎంతో సమర్ధతతో వ్యవహరించి, జగన్ వ్యతిరేక వోటు చీలకుండా, జగన్ పతనానికి ప్రధాన కారకుడయ్యాడు. జగన్ ని అధ:పాతాళానికి తొక్కుతాను అని చేసిన తన ప్రతిజ్ఞ నెరవేరింది. అయితే దీనికి ప్రధాన కారణం సాధారణ ప్రజలలో ...అంటే సైలెంట్ మెజారిటీ మొత్తం పరిస్థితిని సరిగ్గా అంచనా వేసుకున్న ఆలోచనా ధోరణి. గత 2019 ఎన్నికల సమయంలో రాష్ట్ర పరిస్థితి వేరు. తెలంగాణా విడిపోయి, నిర్వీర్యం అయిన ఆంధ్ర ప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎదుర్కోని సమస్య లేదు. సాధించిన ఇతర విజయాల మాట ఎలాఉన్నా పోలవరం మీదా, అమరావతి మీదా

ఎక్కువ ఫోకస్ పెట్టిన చంద్రబాబుకి మోడీ సర్కార్ ఎక్కువగా సహకరించ లేదు. అమరావతి విషయానికొస్తే...ఆ ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ రంగానికి రెక్కలు వచ్చినా ఆ లాభాలు అన్నీ చంద్రబాబు వర్గానికి మాత్రమే దక్కుతున్నాయి అనే వ్యతిరేక భావం ప్రజలలో, మరీ ముఖ్యంగా ఆ రంగం లో ఉన్న ఇతర అగ్రవర్ణాలలో అప్పుడు బాగా నిలదొక్కుకుంది. అప్పటి ఆ నేపథ్యంలో "ఒక్క చాన్స్" అన్న జగన్ నినాదం బాగా పనిచేసింది. ఒక పక్క మోడీ సర్కార్ "చెంబుడు నీళ్ళూ, పిడికెడు మట్టీ" తప్ప అమరావతి నిర్మాణానికి కానీ, పోలవరానికి కానీ తగిన స్థాయిలో సహకరించక పోవడానికి చంద్రబాబు కూడా కారణం ఏమో అనే అనుమానాలు కూడా ప్రజలలో ఆనాడు కలిగి ఉంటాయి. ఈ కారణాల వలన 2019 లో చంద్రబాబుని ఓడించి 151 అసెంబ్లీ సీట్లతో జగన్ ని "ఒక ఛాన్స్" ఇచ్చారు ఆంధ్ర ప్రజానీకం. అది దుర్వినియోగం అయింది కాబట్టి, ఇప్పుడు చంద్రబాబుతో నూతన ఉత్తేజంతో ఉన్న పవన్ కలయిక, బీజేపీతో కూడా సఖ్యత పెరిగిన నేపథ్యంలో అదే ఆంధ్ర ప్రజానీకం మూకుమ్మడిగా మళ్ళీ చంద్రబాబుకి పట్టం కట్టారు. ఇప్పుడు అమరావతిలో రియల్ ఎస్టేట్ కి జగన్ వలన అడుగంటిన ధరలకి మళ్ళీ రెక్కలు వచ్చి అగ్రకుల అవకాశవాద పెట్టుబడిదారులకి లాభం చేకూరుతుంది. అటు సంక్షేమ పథకాల లబ్ధిదారులైన 'అమ్మ వొడి" మహిళలు, అవ్వా తాతలు, 'రైతులు, యువత, అధ్వాన్నపు రోడ్ల మీద ప్రయాణం చేస్తూ అవస్థలు పడుతున్న వాహన దారులు, పోలీసు వ్యవస్థ బారిన పడిన వారు, అసంతృప్తితో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు..ఇలా అందరూ కలిసి నిశ్శబ్దంగా ప్రభుత్వ మార్పిడికి తమ తీర్పు ఇచ్చారు. ఈ తీర్పుకి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం సామూహికంగా "హమ్మయ్య" అని ఉపశమనం పొందింది అని చెప్పవచ్చును. అలా అని 40 % శాతం వోట్లు సాధించిన వైఎస్సార్ పార్టీని తక్కువ అంచనా వెయ్యకూడదు. సీట్ల మాట పక్కన పెడితే గత ఎన్నికలలో జగన్ కి వచ్చిన వోట్ల శాతం కంటే ఈ సారి కేవలం పది శాతం మాత్రమే తగ్గింది. అందువలన నాలుగేళ్ళ తర్వాత పరిస్థితిలని బట్టి గుర్రం మళ్ళీ ఎగరా వచ్చు.

ఆంధ్ర ప్రదేశ్ లో ఇప్పుడు ఏర్పడిన రాజకీయ కుల సమీకరణాలకి చంద్రబాబు ఏర్పాటు చేసిన మంత్రివర్గం అద్దం పడుతుంది. "కమ్మ–కాపు కాంబినేషన్ ఈజ్ డెడ్లీ" అన్న బ్రాహ్మణ నాయకుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు ఉండవల్లి అరుణ కుమార్ వ్యాఖ్య గమనించదగ్గది. ఈ సారి ఎన్నికలలో వైశ్యులు నామమాత్రంగానే ఉన్నారు. ఇక ప్రభుత్వం, పరిపాలనా విషయాలలో బ్రాహ్మణ, వెలమ, క్షత్రియులైన రాజులు, మైనారిటీ వర్గాలైన ముస్లిం, క్రైస్తవుల ప్రభావం ఆ మాత్రం కూడా లేదు. అయితే రాజకీయాలలో తప్ప దైనందిన సాధారణ ప్రజా జీవితంలో ఈ కుల పరిణామాలు ఎక్కువ ప్రభావం చూపించవు ఎప్పటి లాగానే!. తెలుగు భాష, సాహిత్యం, కళారూపాలు, సంస్కృతులని కొంచెం అయినా పట్టించుకుంటారేమో అనే చిన్న ఆశాదీపం వెలిగింది కానీ ఏమో, ఎవరు చెప్పగలరు?

ఆఖరిగా....మోడీ సర్కార్....ఈ ఎన్నికలలో మోడీ నెగ్గినా ఓడిపోయినట్టే. ఎందుకంటే 2014, 2019 ఎన్నికల లాగా ఈ సారి బీజేపీకి ఏక పక్షంగా ప్రభుత్వం ఏర్పాటు చేసే అంత మెజారిటీ రాలేదు. అంటే 240 సీట్లతో మెజారిటీ

వచ్చినా ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడానికి కావలిసిన 272 సీట్లు రాలేదు కాబట్టి తెలుగు దేశం, జనతా దళ్ ల సహకారం తో ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వం మోడీ నాయకత్వం లో ఏర్పాటు అయి,ది. కాశీ విశ్వేశ్వరుడి ఆలయ పునరుద్ధరణ, అయోధ్య లో రామ మందిర నిర్మాణాలు జరిగినా ఆ శ్రీరాముడి "దయవలన" మైనారిటీ వర్గాలైన ముస్లిమ్లు, క్రైస్తవులు మూకుమ్మడిగా బీజేపీ కి వ్యతిరేకంగా కాంగ్రెస్ కి వోటు వేశారనే చెప్పుకోవాలి. అలాగే రాహుల్ గాంధీ పార్టీ కాంగ్రెస్ ఓడినా గెలిచినట్టే. ఎందుకంటే వాళ్ళకి ఇది వరలో కంటే ఎక్కువగా ఈ సారి 99 సీట్లు వచ్చాయి. కానీ మిత్రపక్షాలతో కలిసి ఇండియా కూటమిగా ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడానికి మెజారిటీ లేదు. అంచేత మళ్ళీ ప్రధాన ప్రతిపక్షం గానే పార్లమెంట్ లో అడుగుపట్టాలి. వ్యక్తిగతంగా రాజీవ్ గాంధీ అత్యధిక మెజారిటే తో రాయ్ బెరైలీ లో విజయం సాధించి స్మృతీ ఇరానీ వాచాలత్వానికి అడ్డుకట్ట వెయ్యడం అతనికి చాలా సంతోషం కలిగించి ఉంటుంది.

ఈ సారి ఎన్నికలలో పూర్తిగా ఓటమి చెందినది రకరకాల పోల్స్ నిర్వహించి ప్రజాగళాన్ని వినిపిస్తున్నాం అనుకున్న పోలింగ్ కంపెనీలు, టీవీ చానెళ్ళు అని ఖచ్చితంగా చెప్పవచ్చును. వందలాది పోలింగ్ కంపెనీలు ప్రజాభిప్రాయాలు సేకరించి, ఊహించి ప్రకటించిన ఫలితాలలో ఒక్కటంటే ఒక్కటి కూడా అసలు ఫలితాల దరిదాపులలోకి రాలేదు. అంటే ప్రజలు పోలింగ్ వారు అడిగారు కాబట్టి అప్పటికప్పుడు ఏదో ఒకటి చెప్పేసినా తమ అభిప్రాయాలని తమలోనే దాచుకుని వాటిని వోటింగ్ సమయంలో మాత్రమే రహస్యంగా బహిర్గతం చేశారు అనే అనుకోవాలి. పోలింగ్ కంపెనీలని ప్రజలు నోటితో మెచ్చుకుని నొసలుతో వెక్కిరించారు.

ఏది ఏమైనా....మొత్తానికి దేశం లోనూ, రాష్ట్రాలలోనూ ఎన్నికలు ఎంతో ప్రజాస్వామికంగా జరిగి సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడడం ఎంతో సంతోషాన్ని కలిగించి, ఎంతో గర్వంగా ఉంది

**COMMENTS**